## [illegible]

**అనేక పత్రికలు, పాఠకులు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుం టుందో ఊహించి కింది బాక్సులో రాయండి.**

జనవరి 1 : ఓ అద్భుతమైన అమ్మాయిని ఈ రోజు చూసేను ! అంతే : నా గుండె ఆగి పోయినట్లనిపించింది ! ఏమా అందం ? జలపాతాలూ.... వెన్నెలనీడలు, నక్షత్రగుచ్ఛాలు ఆ మేనిలో దాగిన అనుభూతి....

జనవరి 2 : మళ్ళీరోజు ఆ దేవత కన్పించింది. క్షణం నిలబడిపోయేను. వాళ్ళ ఫ్రెండ్స్ మాటలవల్ల పేరు తెల్సింది. కౌముదిట ! వాట్ ఎ గుడ్ నేమ్ ? అండ్ వాట్ ఎ స్ట్రక్చర్ ?

జనవరి 3 : రాత్రి కల్లోకి కౌముది వచ్చింది. జారిపోయే నునుపు ఒంటిపైన బంగారు చీరె కట్టుకొని ! ఆ నడుంపై తలవాల్చి.... ఆ ఎత్తయిన గుండెలమధ్య నిదురిస్తూ నేను....

జనవరి 4 : హిప్ హిప్ హుర్రే.... నన్నుచూసి కళ్ళెత్తి చిన్న చిర్నవ్వు విసిరింది. అబ్బ.... లైఫ్ లాంగ్‌లో మరువలేని చిర్నవ్వు !

జనవరి 5 : ఆమెని వెంబడించేను ! ఇల్లు తెల్సింది. నేనామె వెంటబడ్తున్నట్లు ఆమె కూడా అబ్జర్వ్ చేస్తుందహో ! బాగాడబ్బున్న పిల్ల ! కానీ ఆ ఒళ్ళే బంగారం ! ఓహ్ !

జనవరి 6 : కౌముది.... కలలోనా నీవే.... ఇలలోనా నీవే మ్మ్మ్మ్....

జనవరి 7 : కౌముది....కౌముది....ఐలవ్యూ.... నిన్ను విడిచి నే వుండలేను. బ్రతకలేను. నిన్ను చాలా డీప్‌గా లవ్ చేస్తున్నాను.

జనవరి 8 : ఏంకావాలి కౌముది ? నా ప్రాణాలా? త్యాగాలా ? ఏంచేయను నీ ప్రేమ పొంద డానికి ?

జనవరి 9 : ఆమెని అడుగుతా ! మంచి మంచి కొటేషన్లతో లవ్ లెటర్ రాసేను.

జనవరి 10 : కౌముది అన్నయ్య నన్ను బాద గొట్టేడు ! అదెంత మాటలంది ? కోతి, కొంగ... కొండముచ్చు వెధవ అని.... ధూత్.... ఆదెవరికావాలి ? ఛత్.... నీయమ్మ !


జనవరి 11 : ప్రొద్దున బస్టాప్‌లో నిలబడితే చూసేను.... ఓహ్.... ఎంత అందాల సుందరి ? పేరూ కనుక్కున్నాను. పద్మశ్రీట ! పద్మశ్రీ.... పద్మశ్రీ.... ఐ లవ్యూ పద్మశ్రీ.... నీవులేందే బ్రతుక లేను పద్మశ్రీ....

— ధరణికోట రమణ్‌కుమార్

కేరాఫ్ డి. వి. కృష్ణ
స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ (పి. డబ్ల్యు)
పాల్వంచ, (ఖమ్మంజిల్లా) 507115

*స్రవంతి నెం : 26లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత్రి టి. సుహాసిని పెట్టిన పేరు: అసలు సంగతి*

*ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీ పాలకోడేటి సత్యనారాయణ రావు*



ఇచ్చిన ఒక్క వాక్యం ఆధారంగా కథరాయటం నిజంగా సర్కస్ ఫీట్‌లాంటిదే: "సమస్యాపూర్యం"లో ఇచ్చే దత్త పది కూడా ఇలాంటిదే అనుకుంటాను. మొత్తానికి "లిటరరీఫీట్" చేయటానికి సాహసించిన వాళ్ళెందరో ఉండటం సంతోషంగా వుంది.

వచ్చినకథల్లో బాగున్నవి చాలానే ఉన్నాయి కానీ వాటిలో చాల కథలు భర్త- భార్యను మరొకరి దగ్గరకు పంపేందుకు సిద్ధపడితే ఆవిడ దాన్ని కాదనటం, లేదా ఎక్కువ కట్నం కావాలని పేచీ పెడితే ఆవిడదాన్ని ప్రతిఘటించటం వంటి థీమ్స్‌తో ఉన్నాయి. అయితే రెండే ఎంచుకోవాలన్న నియమం ఉంది కాబట్టి రెంటినే ఎంచుకున్నాను.

వాటిలో "ఆంటువ్యాధి" కథలో కొంత "అబ్సర్డిటీ" ఉన్నా మంచి కొసమెరుపు కథ! చదివిన నాలుగైదుసార్లూ సరదాగా నవ్వుకోగలిగాను. అందుకే దాన్ని, మరో కథ "మొక్కైవంగనిది" నే ఎన్నుకొన్నాను. ఈ శీర్షికలో పాల్గొంటున్న వారందరికీ నా అభినందనలు.

చూశారుగా ఎంత నిస్సంకోచంగా చెప్పారో రచయిత పాలకోడేటి గారు. ఎన్నో నవలలు రాసి, ఎన్నో కథలకి, నవలలకి బహుమతులు తెచ్చుకొని తనకంటూ ఓ స్థానాన్ని ఏర్పరచుకున్న వీరు ఓ మంచి వ్యక్తి, ఉత్తమ రచయితను.

# మొక్కైవంగనిది....

ఆనందరావు పచ్చి నాస్తికుడు. కేవలం తన ఉద్దేశాలను మాటల్లోనే కాక చేతల్లో చూపించే వ్యక్తి. అందువల్లనే నాస్తికుడైనా ఆ ఊళ్ళో అతనంటే అందరికీ గౌరవం.

ఆ ఊళ్ళో ఈ ఏడే "నాస్తిక సంఘం" స్థాపించాడు. ఇతనంటే ఎంత మందికి గౌరవం ఉన్నా సంప్రదాయవాదులకు కన్నెర్రగా కూడా ఉండేది. ఆనందరావుకి ఒక్కడే కొడుకు. వరంగల్‌లో మెడిసిన్ చదువుతున్నాడు. ఆనందరావు అభిప్రాయాల్ని ఇంట్లో జానకమ్మ, కొడుకు మురళీ పాటిస్తారు.

ఆనందరావు మంచి మాటకారి. చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా, సరళంగా పామర జనానికి అర్థమయ్యేలా చెప్పగలడు.

"నాస్తిక సంఘం" ప్రతినెలా సర్వసభ్య సమావేశం జరుపుతుంది. దాదాపుగా 60 మంది సభ్యులు ఏర్పడ్డారు. ప్రతినెలా ఒక విషయం తీసుకొని దానిపై సమగ్ర చర్చలు జరపటం, మూఢ నమ్మకాలను ఖండించడం, ఊరి అభివృద్ధికి పాటుపడ్డం ఇవీ ఆ సంఘ కార్యక్రమాలు.

నాస్తిక సంఘం స్థాపనతో ఆ ఊరి యువతరంలో గొప్ప మార్పు వచ్చింది.

ఆ రోజు సర్వసభ్య సమావేశం మీటింగ్‌లో చర్చించాల్సిన అంశం "వివాహం - సంప్రదాయాలు."

"తాళి కట్టడం అనే ఆచారం ఎలా మొదలైందో మీకు తెలుసా?" అన్నాడు ఉపోద్ఘాతంలోకి వస్తూ!

ఎవరూ జవాబివ్వలేదు. చాలా విషయాలు ఆనందరావు ప్రశ్నించడం, తిరిగి ఆయనే జవాబు చెప్పడం అనవాయితీగా మారింది.

"నాగరికత అభివృద్ధి చెందని రోజుల్లో స్త్రీలను పురుషులు బానిసలుగా చూసేవారు. బలమున్నవాడిదే రాజ్యం అనే సిద్ధాంతముండేది. స్త్రీల గురించి తరచూ కొట్లాటలు జరుగుతుండేవి ఆ కొట్లాటల్లో గెలుపొందిన పురుషుడు స్త్రీని తన వెంట తీసికెళ్ళేవాడు. పశువు మెడలో పలుపు తాడు వేసి తీసుకుపోయే మాదిరిగా స్త్రీ మెడలో ఒక తువ్వాలు లాంటిది వేసి తన వెంట లాక్కెళ్ళేవాడు. రానురాను ఆ పద్ధతి "తాళి కట్టడం" అనే ఆచారంగా మారింది" అన్నాడు.

ఈ విషయాలు విన్న తర్వాత చాలా మంది చేదు మందు తిన్నట్లుగా ముఖాలు పెట్టారు.

"అవును! నిజం నిష్ఠూరంగానే ఉంటుంది కదా!" అనుకున్నాడు ఆనందరావు లోలోపల!

చౌదరి అడగనే అడిగాడు.

"తాళి కట్టడం అనవసరమే కదా?" అని.

అవునన్నట్లుగా తలూపాడు ఆనందరావు.

"నీ భార్య తాళి ఎందుకు ధరిస్తోంది? ఇన్ని మాటలు చెప్పిన వాడివి ఆ తాళి తీసివేసి మాట్లాడితే బావుండేది!" అన్నాడు వ్యంగ్యంగా!

చౌదరి తత్త్వం అందరికి తెలుసు. అడ్డు పుల్లలు వేయడంతో ఘటికుడు.

"స్వతహాగా విషయాలను గమనించిమారాలి కాని, మారాలని బలవంతం చేస్తే మారతారా?" అన్నాడు పేలవంగా.

సమావేశం ముగిసింది. చౌదరి మాటలే గింగురుమంటున్నాయి. ఎన్నోసార్లు జానకమ్మతో "తాళి" గురించి మాట్లాడాడు. ఆ ఒక్క విషయంలో తప్ప మిగతా అన్ని విషయాల్లో ఏకీభవించింది. "ఇప్పుడు కూడా అడిగి చూద్దాం!" అనుకున్నాడు.

భోజనాలయ్యాయి. "జానకీ ఒక్క మాట అడుగుతాను! కోపం తెచ్చుకోవద్దు" అన్నాడు అర్థింపు ధోరణిలో.

"మళ్ళీ ఏదో కోపం ముంచే మాటలు మాట్లాడాడేమో" అనుకుంది. "చెప్పండి" అంది.

"ఆ తాళి తీసేయరాదు." అన్నాడు భయంగానే.

"శాశ్వతంగా విడిగానైనా ఉంటాను కాని ఈ పని మాత్రం చేయలేను." భార్య గొంతులోని స్థిరత్వానికి ఇరవై ఒక్క సంవత్సరాలు సంసారం చేసిన ఆనందరావు క్షణం ఆశ్చర్యపడ్డాడు. వెంటనే తమాయించుకుని—

"భలేదానివే ఏదో జోక్‌గా అంటే అంత మాత్రానికే సీరియస్‌గా అయిపోవాలా?" అని నవ్వుతూ వాతావరణాన్ని తేలిక చేసే ప్రయత్నం చేసాడు.

"ఈ విషయంలో దూరడం జుగని పని! మనుషుల్లో ఎంత బలంగా నాటుకుపోతాయి ఈ ఆదారాలు" అనుకుంటూ నిద్రకుపక్రమించాడు.

-వి. ఎస్. పాణి
చీఫ్ కరాటే ఇన్‌స్ట్రక్టర్,
సన్‌రేస్ మార్షల్ ఆర్ట్స్ అకాడెమీ,
11-26-7 కొత్తవాడ, వరంగల్-506012

స్రవంతి నెం. 24లో ఇచ్చిన

"శాశ్వతంగా విడిగానైనా ఉంటాను కానీ ఈపని మాత్రం చేయలేను" భార్య గొంతులోని స్థిరత్వానికి ఇరవై ఒక్క సంవత్సరాలు సంసారం, చేసిన ఆనందరావు క్షణం ఆశ్చర్యపడ్డాడు.

వాక్యం ఆధారంగా రాసిన కథలు

# అంటువ్యాధి

"చూడు మిస్టర్ ఆనందరావు మీజబ్బు నయం కావాలంటే మీ భార్యాభర్తలు కొన్నాళ్ళపాటు విడివిడిగా జీవించడమే మంచిది."




తమ ఫామిలీ డాక్టర్ చెబుతున్నదేమిటో ఆనందరావ్‌కి అర్థం కావడంలేదు. అతను గోడ మీదనున్న న్యూడ్ కాలెండర్‌వైపు ఆత్రంగా చూస్తున్నాడు. డాక్టర్‌గారికి అతని జబ్బు విషయం గుర్తొచ్చి గొంతు పెద్దదిచేసి మళ్ళీ ఆ మాటే గట్టిగా చెప్పాడు—

"ఏమిటీ, విడివిడిగా జీవించడమా? మా ఆవిడ అందుకు ఒప్పుకోదే? నన్ను విడిచి బ్రతకలేనని గోల చేస్తుందండీ!" ఆనందరావు అమాయకంగా చెప్పాడు. "అబ్బ! నేను మిమ్మల్ని డైవోర్స్ తీసుకోమని చెప్పడం లేదండీ! ఆ మాటనడానికి నేను లాయర్ని కాదండీ! డాక్టర్ని" విసుక్కున్నాడు ఫామిలీ వైద్యుడు.

"డాక్టరు గనక నేగదండి! మందు అడుగుతున్నదీ" దీర్ఘం తీశాడు ఆనందరావు.

"మందు కావాలట్రా నీకు నా బొంద" లోలోపలే తిట్టుకొన్నాడు డాక్టర్. కాసేపాగి శాంతంగా నచ్చజెప్పాడు. "చూడండీ! ఈ జబ్బు మీకు మీ ఆవిడద్వారా సంక్రమించింది. ఇది దీర్ఘవ్యాధి. ఓపట్టాన నయంకాదు. కొంత కాలం మీ భార్యా భర్తల పడకలు దూరం అయితే మీ ఆరోగ్యానికి ఎంతైనా మంచిది— విడిగా జీవించడమంటే వేరే ఏమీ కాదు. విడిగా నిద్రించడమే. తెలిసిందా?"

అర్థం అయినట్లు తలూపాడు ఆనందరావు.

ఆ రాత్రే అర్థాంగికి ఆ విషయం చెప్పాడు.

"ఇకమీదట నీ గది వేరే-నా గది వేరే!" అంటూ ఖండితంగా చెప్పేశాడు—

ఆనందరావుభార్యామణి ఊర్మిళ వల్ల కాదంది.

నీవల్లే ఈ రోగం నాకు వచ్చిందట! డాక్టరు చెప్పాడు. కొన్నాళ్ళపాటు నీకు దూరంగా ఉండమన్నాడు - అందుకే మనం విడివిడిగా పడుకొందాం" ఆనందరావు నిష్ఠూరంగా పలికాడు.

"శాశ్వతంగా విడిగానైనా ఉంటానుకానీ ఈ పనిమాత్రం చేయలేను" భార్య గొంతులోని స్థిరత్వానికి ఇరవై ఒక్క సంవత్సరాలు సంసారం చేసిన ఆనందరావు క్షణం ఆశ్చర్యపడ్డాడు.

తనను విడిచి క్షణమైనా నిద్రించలేని తన భార్య ప్రేమానురాగాలను తెల్సుకొని అతను కించిత్ గర్వపడ్డాడుకూడా!

కానీ తన ఫామిలీ డాక్టర్ సలహాను పాటించలేక పోతున్నందుకు అతనికి బాధ కలిగింది! "హే భగవాన్! నా రోగం తగ్గేదారే లేదా?" అంటూ ఆనందరావు ఆవేదన పడ్డాడు.

ఇంతకీ ఆనందరావు వ్యాధి బ్రహ్మచెవుడు అందుకు కారణం అతని అర్థాంగి ఘోరమైన గురక!

— తిరుమూరు సుధాకర్ రెడ్డి
తెలుగు లెక్చరర్
శ్రీ వేణుగోపాలస్వామి కళాశాల
మూలాపేట, నెల్లూరు-524003

## ఓకథ రాయండి

ఈక్రింది ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడైనా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కధరాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

"ఏం? ఆపేశారేం? నేనే మీ స్థానంలో ఉంటే నిజంగానే పొడుచుకు చచ్చేదాన్ని" కోపంగా అంది శాంత తన భర్త రాఘవతో.